సాక్షి
రాజన్న సిరిసిల్ల
బుధవారం । 16 । అక్టోబర్ । 2024



కనులపండువగా కల్యాణోత్సవం

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం లింగన్నపేటలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం నిర్వహించారు.

న్యూస్‌రీల్

గురుకుల భవనానికి తాళం



వేములవాడఅర్బన్: పట్టణంలోని భవానినగర్ బోయినపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల గేట్‌కు యజమాని రాకేశ్ మంగళవారం తాళం వేశాడు. యజమాని మాట్లాడుతూ ఎనిమిది నెలలుగా అద్దె చెల్లించడం లేదన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి చేరుకొని అద్దె విషయం ఉన్నతాధికాలకు తెలుపుతామని, సహకరించాలని కోరగా తాళం తీశారు.

పెరటికోళ్ల పెంపకం లాభదాయకం



ఇల్లంతకుంట(మానకొండూర్): పెరటికోళ్ల పెంపకం లాభదాయకమని జిల్లా అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని సోమవారంపేటలోని రాజన్న మదర్ యూనిట్‌లో పెరటికోళ్ల విక్రయాలను మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. పెరటికోళ్లు పెంచితే రెండు నెలల తర్వాత రెట్టింపు ఆదాయం వస్తుందన్నారు. డీపీఎం సుధారాణి, ఎంపీడీవో శశికళ, ఏపీఎం వాణిశ్రీ, సీసీలు రామచంద్రరెడ్డి, వెంకటేశం, రాజేశ్వరీ పాల్గొన్నారు.

డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు రానోళ్లను గుర్తించండి



సిరిసిల్లటౌన్: డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల కోసం నిర్వహించిన డ్రాలో పేర్లు రాని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ కోరారు. ఈమేరకు మంగళవారం సిరిసిల్ల మున్సిపల్ ఎదుట నిరసన తెలిపి మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక సర్వేలు చేసి పేదలుగా గుర్తింపు పొందిన 920 మందికి అన్యాయం జరిగిందన్నారు. డ్రాలో పేర్లు రాక డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వలేదన్నారు. ఈ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. ఈమేరకు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్‌కు వినతిపత్రం ఇచ్చారు. కోడం రమణ, అన్నల్‌దాస్ గణేశ్, నక్క దేవదాసు, తిరుపతి, బాబు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించండి



ముస్తాబాద్(సిరిసిల్ల): ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. మండలంలోని పోతుగల్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అధికారుల తీరుతో రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం దళారుల పాలవుతుందన్నారు. వ్యాపారులు క్వింటాలుకు రూ.1800లకే కొంటుండడంతో రైతులు రూ.600 వరకు నష్టపోతున్నారన్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి సన్న, దొడ్డు రకాలకూ రూ.500 బోనస్ ఇవ్వాలని కోరారు. మిద్దె నర్సయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ స్పెషల్ డ్రైవ్



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని లేఔట్ రెగ్యులరైజేషన్ సర్టిఫికెట్(ఎల్‌ఆర్‌ఎస్) కోసం అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. భూముల అక్రమాలకు అడ్డుకట్ట వేయడంతోపాటు హద్దులను గుర్తించి యజమానులకు యాజమాన్యం పత్రాలు ఇవ్వడానికి భూముల సర్వేను ప్రభుత్వం చేపట్టింది. ఇందులో భాగంగా మండలంలో వారం రోజులుగా ఎల్‌ఆర్‌ఎస్‌పై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. 2020లో గత ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ కోసం రూ.వెయ్యి ఫీజుతో దరఖాస్తులు స్వీకరించింది. కలెక్టర్ ఆదేశాలతో మండలంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు ఎంపీడీవో సత్తయ్య తెలిపారు. భూయజమానులు అధికారులకు సహకరించాలని కోరారు. ఎంపీవో జోగం రాజు. కార్యదర్శులు రామకృష్ణ, సురేశ్, బిల్‌కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మీదే గురుతర బాధ్యత



- ఆదరణ కోల్పోతున్న సర్కారు బడులపై నమ్మకం పెంచాలి
- విద్యార్థులను పాఠశాలలకు రప్పించాలి
- వారి భవిష్యత్తుకు బాటలు వేయాలి
- ఉమ్మడి జిల్లాలో విధుల్లో చేరుతున్న కొత్త ఉపాధ్యాయులు

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేక.. బోధన సరిగా జరగక.. గాడితప్పిన పాఠశాలలకు మంచి రోజులు రానున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో టీచర్ పోస్టులు భర్తీ అవుతున్నాయి. కొత్త గురువులు తమ బాధ్యతలు సమర్థంగా నిర్వహించాలి.. విద్యార్థుల సంఖ్య తగ్గి, ఆదరణ కోల్పోతున్న నేపథ్యంలో సర్కారు బడులపై నమ్మకం పెంచేందుకు కృషి చేయాలి. పేద పిల్లల్లో జ్ఞాన జ్యోతులు వెలిగించి, వారి భవిష్యత్తుకు బాటలు వేయాలి. కొలువులు సాధించిన ఉపాధ్యాయులు బాధ్యతలు తీసుకుంటున్న నేపథ్యంలో 'సాక్షి' ప్రత్యేక కథనం.

– సిరిసిల్ల ఎడ్యుకేషన్/కరీంనగర్/సాక్షి, పెద్దపల్లి/జగిత్యాల

ప్రభుత్వ పాఠశాలలు కొత్త టీచర్లతో కళకళలాడనున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల పదోన్నతులతో ఖాళీ అయిన స్థానాలన్నీ వీరితో భర్తీ కానున్నాయి. స్కూల్ అసిస్టెంట్లు విధుల్లో చేరిన తొలిరోజు నుంచే బడి బాగు కోసం పాటుపడాలి. విద్యార్థుల సంఖ్య పెంచేలా చూడాలి.

భాషా పండితులు చొరవ చూపాలి

తెలుగు, హిందీ, ఆంగ్ల భాషలంటే విద్యార్థులు భయపడుతున్నారు. విధుల్లో చేరనున్న భాషా పండితులు ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపాలి. ఆటపాటలు, కథలు, నుడికారాలు, సామెతలు వంటి వాటితో పిల్లలకు భాషపై ఆసక్తి పెంచాలి.

క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి..

వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడం శుభపరిణామం. ఇకనుంచి మైదానాలు కళకళలాడాలి. విద్యార్థులను జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి.

సబ్జెక్టులపై పట్టు సాధించేలా..

ఉమ్మడి జిల్లాలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఇటీవల పదోన్నతుల ద్వారా సబ్జెక్టు ఉపాధ్యాయులు వచ్చినా.. ఇంకా కొరత ఉంది. విధుల్లో చేరనున్న స్కూల్ అసిస్టెంట్లు ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థులకు ప్రతీ పాఠ్యాంశాన్ని బోధించాలి.

'ప్రత్యేక' పిల్లల విషయంలో..

ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక అవసరాల విద్యార్థులు బోధకులు లేక ఇబ్బంది పడుతున్నారు. కొత్త టీచర్లు పిల్లల మానసిక వికాసాభివృద్ధి జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.



వీరు ఆదర్శం

విద్యాసామగ్రి అందజేత



దుర్గారెడ్డి

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని నర్సింగాపూర్ హైస్కూల్ సోషల్ టీచర్ కొండం దుర్గారెడ్డి పాఠశాలకు, విద్యార్థులకు ఉపకారిగా మారారు. పిల్లలకు పలుమార్లు టైలు, బెల్టులతోపాటు, షూస్, యూనిఫామ్స్ అందించారు. మంచినీటి సౌకర్యం కోసం స్కూల్లో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేశారు. పాఠశాలలో ఇటీవల నిర్వహించిన మండలస్థాయి ఎస్జీఎఫ్ క్రీడల్లో విజేతలకు మెడల్స్ ప్రదానం చేశారు. గతంలో మాన్వాడ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పని చేసిన సమయంలోనూ ఆయన నోటుబుక్కులు, పెన్నులు, వారానికోసారి మంచి భోజనం అందించేవారని పలువురు విద్యార్థులు తెలిపారు. ఏ స్కూల్లో పని చేసినా ఆ స్కూల్ అభివృద్ధి, విద్యార్థుల కోసం తనకు తోచిన సాయం చేస్తున్నట్లు దుర్గారెడ్డి పేర్కొన్నారు.

తక్కువ ఖర్చుతో ప్రయోగాలు



మహేశ్ చంద్ర

ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంట ఉన్నత పాఠశాలలో మహేశ్‌చంద్ర బయాలజీ టీచర్‌గా పని చేస్తున్నారు. ఆయన విద్యార్థులతో తక్కువ ఖర్చుతో ప్రయోగాలు చేయిస్తున్నారు. వివిధ ప్రాజెక్టులకు రూపకల్పన చేయించి, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా చూస్తున్నారు. ఆయన ఆధ్వర్యంలో పిల్లలు తయారు చేసిన ప్రాజెక్టు ఇంటర్నేషనల్ ఇన్నోవేషన్ ఫెయిర్–2019లో రెండో బహుమతి గెలుచుకుంది. నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్–2019, సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్–2020 తదితర పోటీలతోపాటు పలు సైన్స్ ప్రజ్ఞా పోటీలకు విద్యార్థులను పంపించారు. బడిబాట కార్యక్రమంలో సమీప గ్రామాల పిల్లలను పాఠశాలలో చేర్పించారు. మహేశ్‌చంద్ర 2019లో జిల్లా స్థాయి, 2021లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు.

మూత'బడి'ని తెరిపించారు..



సురేశ్‌కుమార్

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మూత'బడి'ని తెరిపించారు ఎస్జీటీ అమృత్ సురేశ్‌కుమార్. కాల్వశ్రీరాంపూర్ మండలం గంగారం పంచాయతీ పరిధి ఊశన్నపల్లె ప్రాథమిక పాఠశాలకు 2022 జనవరిలో ఆయన బదిలీపై వచ్చారు. ఐదుగురు విద్యార్థులే ఉండటంతో వారిని గంగారం ప్రాథమిక పాఠశాలలో చేర్పించి, ఈ బడిని మూసివేశారు. తర్వాత, సురేశ్‌కుమార్ విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి, 23 మంది పిల్ల లను అడ్మిషన్ చేయించారు. ప్రస్తుతం 45 మంది ఉన్నారు. వారికి ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన చేయడంతోపాటు ఉచితంగా టైలు, బెల్టులు, ఐడీ కార్డులు అందజేశారు. మరో టీచర్, విద్యావలంటీర్ నియామకం జరిగేలా చూశారు. ఈ ఏడాది అభిజ్ఞ అనే విద్యార్థిని ఆదిలాబాద్ జిల్లా క్రీడా పాఠశాలకు ఎంపికైంది. మరో ముగ్గురు విద్యార్థులు సిరిసిల్ల, సుల్తానాబాద్, కాటారం గురుకుల పాఠశాలల్లో ప్రవేశం పొందారు.

స్కూల్‌కు గేట్లు, కెమెరాలు



రామచంద్రం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలోని నాలుగు గదుల్లో హైస్కూల్ నిర్వహిస్తున్నారు. చీకటి పడగానే ఆకతాయిలు ఈ పాఠశాలను తమ అడ్డాగా మార్చుకొని, మద్యం సేవించడం, మల, మూత్ర విసర్జన చేయడం వంటివి చేసేవారు. దీంతో హెచ్‌ఎం కొండ్ల రామచంద్రం సొంతంగా రూ.లక్ష వెచ్చించి, స్కూల్‌కు గేట్లు, సీసీ కెమెరాలు బిగించారు. మధ్యాహ్న భోజనం రుచిగా ఉండటం లేదని గుర్తించి, నిర్వాహకులను దూరం పెట్టారు. వారు ఆందోళన చేపట్టడంతో పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరించి, కొత్తగా మహిళా సంఘానికి మధ్యాహ్న భోజన బాధ్యతలు అప్పగించారు. పిల్లలకు విద్యాసామగ్రి అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. చైతన్య చారిటబుల్ ట్రస్టు సహకారంతో స్కూల్లో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయించామని, సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్న తెలిపారు.

ఆటపాటలతో బోధన



బలరాం

జమ్మికుంట(హుజూరాబాద్): విద్యార్థులకు ఆటపాటలతో పాఠ్యాంశాల బోధనకు ప్రాధాన్యం ఇస్తున్నారు జమ్మికుంట మండలంలోని కోరపల్లి ప్రాథమిక పాఠశాల టీచర్ గుడిమిల్ల బలరాం. పిల్లల హాజరుశాతం పెంచుతూ.. సులభమైన, వినూత్న పద్ధతుల్లో విద్యాబోధన చేస్తున్నారు. విద్యార్థులు స్కూల్ బ్యాగ్‌లు, నోట్ బుక్స్, బహుమతులు అందించి, చదువుపై ఆసక్తి పెంచుతున్నారు. చదువులో వెనకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. టీఎల్‌ఎం మేళాలో తెలుగు సబ్జెక్టులో మండల, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. సమగ్ర శిక్ష రాష్ట్ర జేడీ రాజీవ్, డీఈవో జనార్దన్‌రావుల చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగానూ ఎంపికయ్యారు.

పాఠశాలల సమాచారం

కరీంనగర్

ప్రభుత్వ పాఠశాలలు : 615
బాలురు : 19,602
బాలికలు : 17,050
మొత్తం విద్యార్థులు : 36,672
మొత్తం టీచర్ పోస్టులు : 3,225
పని చేస్తున్నవారు : 2,931
(కొత్తవారితో కలిపి)

కరీంనగర్ జిల్లాలో 510 టీచర్ పోస్టులు ఖాళీ ఉండగా.. డీఎస్సీ–2024లో 245 పోస్టులకు పరీక్ష నిర్వహించారు. 219 మంది ఎంపికవగా మంగళవారం 215 మందికి పోస్టింగ్ ఇచ్చారు. నలుగురి సర్టిఫికెట్లు పరిశీలనలో ఉన్నాయి.

పెద్దపల్లి

ప్రభుత్వ పాఠశాలలు: 564
బాలురు: 20,186
బాలికలు: 24,372
మొత్తం విద్యార్థులు : 44,372
మొత్తం టీచర్ పోస్టులు : 2,377
పని చేస్తున్నవారు: 2,331
(కొత్తవారితో కలిపి)

పెద్దపల్లి జిల్లాలో 119 టీచర్ పోస్టులు ఖాళీ ఉండగా.. డీఎస్సీ–2024లో 93 పోస్టులకు పరీక్ష నిర్వహించారు. అభ్యర్థుల్లో వివిధ కారణాలతో 20 మందిని పక్కన పెట్టారు. 73 మందికి పోస్టింగ్ ఇచ్చారు.

రాజన్న సిరిసిల్ల

ప్రభుత్వ పాఠశాలలు : 488
బాలురు : 20,059
బాలికలు : 17,757
మొత్తం విద్యార్థులు : 37,816
మొత్తం టీచర్ పోస్టులు : 2,352
పని చేస్తున్నవారు : 2,101
(కొత్తవారితో కలిపి)

రాజన్నసిరిసిల్ల జిల్లాలో 383 టీచర్ పోస్టులు ఉండగా డీఎస్సీ–2024లో 245 ఖాళీలకు పరీక్ష నిర్వహించారు. 132 మంది అభ్యర్థులకు పోస్టింగ్ ఇచ్చారు.

జగిత్యాల

ప్రభుత్వ పాఠశాలలు : 188
బాలురు : 2,620
బాలికలు : 2,293
మొత్తం విద్యార్థులు : 4,913
మొత్తం టీచర్ పోస్టులు : 3,949
పని చేస్తున్నవారు : 3,516
(కొత్తవారితో కలిపి)

జగిత్యాల జిల్లాలో 714 టీచర్ పోస్టులు ఉండగా.. డీఎస్సీ–2024లో ఖాళీలన్నింటికీ పరీక్ష నిర్వహించారు. 282 మందిని ఎంపిక చేసి, 281 మందికి పోస్టింగ్ ఇచ్చారు. ఒకరిని పెండింగ్‌లో పెట్టారు.



కొత్త టీచర్లకు పోస్టింగులు



అలాట్‌మెంట్ లెటర్ ఇస్తున్న అధికారులు

సిరిసిల్లఎడ్యుకేషన్/సిరిసిల్లఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన డీఎస్సీ ద్వారా ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు మంగళవారం పాఠశాలలు కేటాయించారు. జిల్లాలో సెకండరీ గ్రేడ్, స్కూల్ అసిస్టెంట్, పండిత, వ్యాయామ పోస్టులకు 132 మందికి స్కూళ్లను కేటాయించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కౌన్సిలింగ్ విధానాన్ని పరిశీలించారు. జిల్లా విద్యాధికారి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోస్టర్ పద్ధతి ప్రకారమే నియామకాలు చేపట్టాలి

రోస్టర్ పద్ధతి ప్రకారమే ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాలు నాయకులు కోరారు. కలెక్టరేట్‌లో డీఎస్సీ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న హాల్‌లోకి వచ్చి మెరిట్ ఆధారంగా నియమించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు వెల్లడించారు. రోస్టర్ విధానం పాటించకపోతే బహుజన వర్గాలకు, రిజర్వేషన్ ద్వారా వచ్చిన వారికి అన్యాయం జరుగుతుందన్నారు. నారాయణ, భూపాల్‌రెడ్డి, మోతిలాల్, మహేందర్‌రెడ్డి, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: జిల్లాలోని నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు జిల్లా పోలీస్‌శాఖ కృషి చేస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ మంగళవారం తెలిపారు. ఆసక్తి, అర్హత గల యువత దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సీసీటీవీ, సాఫ్ట్‌స్కిల్స్, బేసిక్ కంప్యూటర్‌పై మూడు నెలల ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణకాలంలో ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పదోతరగతి సర్టిఫికెట్‌తోపాటు సమీప పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 18 వరకు దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

రోడ్ల విస్తరణ ఆపండి

- ఆర్డీవో రాజేశ్వర్‌కు వినతి



బైకులపై ర్యాలీగా వచ్చిన వ్యాపారులు

వేములవాడఅర్బన్: ఇప్పటికే సేకరించిన స్థలాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించాలని, రోడ్ల విస్తరణ ఆపాలని వేములవాడ మున్సిపల్ పరిధిలోని నిర్వాసితులు డిమాండ్ చేశారు. మున్సిపల్ ఆఫీస్‌లో మంగళవారం ఆర్డీవో రాజేశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన పట్టణసభకు స్థానికులు బైక్‌ర్యాలీగా వచ్చారు. మొదట ఆర్డీవో రాజేశ్వర్ మాట్లాడుతూ ప్రధాన రహదారిని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. నిర్వాసితుల నుంచి అభిప్రాయాలు, అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. నిర్వాసితులు మాట్లాడుతూ గతంలో రాజన్న గుడి చెరువు స్థలం సేకరించి ఇప్పటి వరకు అక్కడ ఎలాంటి పనులు చేయలేదని, గుడిచెరువు కట్ట కింద బస్టాండ్ కోసం స్థలం గెజిట్ చేసి వదిలేశారని, బద్దిపోచమ్మ ఆలయం వద్ద స్థలం సేకరించి పనులు ప్రారంభించలేదన్నారు. మొదట ఆయా స్థలాల్లో పనులు చేయాలని, తర్వాత రోడ్డు విస్తరణ గురించి ఆలోచించాలని పట్టణ ప్రజలు, రోడ్డును ఆనుకుని ఉన్న దుకాణదారులు స్పష్టం చేశారు. ఈమేరకు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, వైస్‌చైర్మన్ బింగి మహేశ్, కమిషనర్ సంపత్‌రెడ్డి, తహసీల్దార్ మహేశ్‌కుమార్, టీపీవో అన్సార్, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, నరాల శేఖర్, ఇప్పపూల అజయ్, మారం కుమార్, జోగిని శంకర్, సిరిగిరి రామచందర్, రేగుల సంతోష్‌బాబు, గోలి మహేశ్ పాల్గొన్నారు.

మిల్లర్లు బియ్యం అందించాలి



రైస్‌మిల్లర్లతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

- గడువు దాటితే 25 శాతం జరిమానా
- ధాన్యం కొనుగోళ్లకు సహకరించాలి
- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల: జిల్లాలోని రైస్‌మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎమ్మార్)ను అందించాలని అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్ కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం రైస్‌మిల్లర్లతో సీఎమ్మార్‌పై సమీక్షించారు. 2023–24 వానాకాలం(ఖరీఫ్)లో 74 రా రైస్‌మిల్లులకు, 29 బాయిల్డ్ రైస్‌మిల్లులకు 2,00,715 టన్నుల ధాన్యం అందించినట్లు తెలిపారు. దీనికి 1,35,023 టన్నుల బియ్యం రైస్‌మిల్లర్లు ఇవ్వాల్సి ఉండగా.. 1,00,978 టన్నులు అందించారన్నారు. ఇంకా 34,045 టన్నులు అందించాల్సి ఉందని తెలిపారు. రబీ 2023–24 రబీ సీజన్‌లో 24 రా రైస్‌మిల్లులు, 35 బాయిల్డ్ రైస్‌మిల్లులకు మొత్తం 2,56,126 టన్నుల వడ్లను అందించినట్లు తెలిపారు. దీనికి 1,74,165 టన్నుల బియ్యం రావాల్సి ఉండగా ఇప్పటి వరకు 75,111 టన్నులు మాత్రమే ఇచ్చినట్లు తెలిపారు. ఇంకా 99,757 టన్నుల బియ్యం మిల్లర్ల దగ్గరి నుంచి ప్రభుత్వానికి రావాల్సి ఉందన్నారు. అక్టోబర్ 31లోగా బియ్యం అందించాలని ఆదేశించారు. డీఫాల్ట్ కాకుండా ఉండాలంటే గడువులోగా బియ్యం అందించాలని, లేకుంటే మిల్లర్ల వద్ద 25శాతం పెనాల్టీ వసూలు చేస్తామని హెచ్చరించారు. ఈ వానాకాలం ధాన్యం కొనుగోళ్లు రెండు, మూడు రోజుల్లో ప్రారంభిస్తామన్నారు. ధాన్యం దింపుకుని రైతులకు సహకరించాలని కోరారు. డీఎస్‌వో పి.వసంతలక్ష్మి, అదనపు పౌరసరఫరాల అధికారి బి.నందిని, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ పి.రజిత, డిప్యూటీ తహసీల్దార్లు, రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షుడు చేపూరి నాగరాజు, పబ్బ నాగరాజు పాల్గొన్నారు.



అంబారిపై విహరిస్తున్న శ్రీవారు



కోలాటం ఆడుతున్న మహిళలు

జగన్మాత నమోస్తుతే

సిరిసిల్లటౌన్: జగన్మాత ఆండాళమ్మను సుహాసినులు భక్తిప్రపత్తులతో కొలిచారు. సిరిసిల్ల వెంకన్న ఆలయంలో వారం రోజులుగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆండాళమ్మకు ఒడిబియ్యం పోశారు. ఆలయ ఈవో మారుతీరావు, ఏఈవోలు రవీందర్, అర్చకస్వాములు కృష్ణమాచారి, మాజీ చైర్మన్లు ఉప్పుల విఠల్‌రెడ్డి, చేపూరి నాగరాజు, తీగల శేఖర్‌గౌడ్, సంగీతం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సిరిసిల్ల పద్మశాలీలు తమ ఇంటి ఆడపడచుగా భావిస్తూ పద్మావతీ అమ్మవారు, శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి వార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, పద్మశాలీ నాయకులు గూడూరి ప్రవీణ్, గోలి వెంకటరమణ, గుండ్లపెల్లి పూర్ణచందర్, కాముని వనిత, గుజ్జె తార, దార్నం అరుణ, పత్తిపాక పద్మ, జిందం చక్రపాణి, బొల్లి రామ్మోహన్, సంగీతం శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంబారిపై విహరించిన దేవదేవుడు

మంగళవారం రాత్రి శ్రీవేంకటేశ్వరస్వామి అంబారిపై మాడవీధుల్లో విహరించారు. ఆలయ మాజీ చైర్మన్లు ఉప్పుల విఠల్‌రెడ్డి, చేపూరి నాగరాజు, తీగల శేఖర్‌గౌడ్, సంగీతం శ్రీనివాస్, ఈవో నాగారపు మారుతీరావు, ఏఈవో రవీందర్, అర్చకస్వాముల కృష్ణమాచారి పాల్గొన్నారు.



ఒడిబియ్యం పోస్తున్న మహిళలు



పట్టువస్త్రాలతో పద్మశాలీలు

క్లుప్తంగా

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య



దివ్య మృతదేహం

వేములవాడఅర్బన్: సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్ చెందిన నక్క దివ్య (33) మనస్తాపంతో వేములవాడ మండలం ఆరెపల్లి శివారులోని మిడ్‌మానేరు బ్యాక్‌వాటర్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దివ్యకు గతంలోనే రెండు వివాహాలు జరిగి విడాకులయ్యాయి. ఇటీవల డీఎస్సీ పరీక్ష రాసినా ఉద్యోగం రాకపోవడంతో తీవ్ర మనస్తాపంతో మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. మిడ్‌మానేరులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

గుడి చెరువులో దూకి యువకుడు..



నవీన్ (ఫైల్)

వేములవాడ అర్బన్: వేములవాడ రాజన్న ఆలయం ఎదుట బెల్లం దుకాణాల్లో దినసరి కూలీగా పని చేసే మైత్రి నవీన్ (19) మంగళవారం గుడి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాలు.. నవీన్ ఓ మహిళతో ప్రేమలో పడ్డాడు. ఆమె నిరాకరించడంతో ఇటీవల ఆత్మహత్యాయత్నం చేసి కోలుకున్నాడు. మళ్లీ మనస్తాపంతో గుడి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

రాజన్న మహానివేదన ఆలస్యం కాలేదు

- ఆలయ ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడఅర్బన్: రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ సోమవారం రాజన్న దర్శనం సందర్భంగా స్వామి వారి మహానివేదన సమర్పణలో ఎలాంటి జాప్యం కాలేదని రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. మంత్రి సురేఖ స్వామి వారిని మహా నివేదన సమయానికి ముందే దర్శించుకుని, వెళ్లారని పేర్కొన్నారు. సమయానికే మహానివేదన చేశామని ఈవో వెల్లడించారు.

వ్యాపారులు చెప్పిందే ధర



ఇది ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్–హరిదాస్‌నగర్ గ్రామాల మధ్య ఓ రైతు తన పంటను కోశాడు. వడ్లను ఆరబెట్టి అమ్ముదామంటే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభంకాలేదు. ప్రభుత్వం క్వింటాలు వడ్ల ధరను రూ.2,320 నిర్ణయించింది. కానీ వ్యాపారులు నేరుగా పచ్చివడ్లను రూ.1900 క్వింటాలు చొప్పున కొంటున్నారు. ఒక్కో క్వింటాలుకు రూ.420 ధర తక్కువే అయినా వడ్లను ఆరబెట్టే తిప్పలు తప్పుతాయని వ్యాపారులకు అమ్ముకుంటున్నారు.



జిల్లా కేంద్రంలోని రెండో బైపాస్ రోడ్డుపై వడ్లను ఆరబెడుతున్న ఇతను గుగ్గిళ్ల అంజయ్య. రగుడుకు చెందిన అంజయ్యకు ఎకరంనర భూమి ఉండగా.. 50 గుంటల్లో వరిపంట వేశాడు. మరో పది గుంటల్లో కూరగాయలు పండిస్తున్నాడు. మూడు రోజుల కిందట వరిపంటను కోసి బైపాస్‌రోడ్డుపై ఆరబెట్టాడు. వడ్లు ఆరగానే అమ్మేందుకు సిద్ధమయ్యాడు. కానీ ఇప్పటికీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు.

- వడ్లు క్వింటాలు రూ.1,900
- ప్రభుత్వ మద్దతు ధర రూ.2,320
- ప్రారంభంకాని కొనుగోలు కేంద్రాలు
- దళారులకే అమ్ముతున్న రైతులు

సిరిసిల్ల: వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానేలేవు.. వ్యాపారులు పల్లెల్లోకి ప్రవేశించారు. పొలాల్లోకి వెళ్లి పచ్చి వడ్లనే కొంటున్నారు. అయితే ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2320 ఉంటే వ్యాపారులు మాత్రం రూ.1900 మాత్రమే చెల్లిస్తున్నారు. జిల్లా అధికారులు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు చేసేదేమి లేక పచ్చి వడ్లను వ్యాపారులు చెప్పిన ధరకే అమ్మి నష్టపోతున్నారు.

జిల్లాలో 258 కొనుగోలు కేంద్రాలు

జిల్లాలో 258 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు పౌరసరఫరాల అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్‌లు సమీక్షించారు. ఐకేపీ ఆధ్వర్యంలో 44, పీఏసీఎస్ 202, డీసీఎంఎస్ 8, మెప్మా ఆధ్వర్యంలో 4 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మే నెలాఖరులో నారు పోసి, జూన్ నెలాఖరులో నాట్లు వేసిన రైతుల పొలాలు ఇప్పుడు కోతకు వచ్చాయి. అయితే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో చేసేదేమి లేక వ్యాపారులకు తక్కువ ధరకే విక్రయిస్తున్నారు.

3.96 లక్షల మెట్రిక్ టన్నులు లక్ష్యం

జిల్లాలో ఈ ఏడాది 1.80లక్షల ఎకరాల్లో వరిపంట సాగుచేశారు. వానాకాలంలో నీరు సమృద్ధిగా ఉండడంతో రైతులు వరినే ఎక్కువగా వేశారు. ఈ వానాకాలం సీజన్‌లో 3.96 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని ఆశిస్తున్నారు. జిల్లాలో 3 లక్షల మెట్రిక్ టన్నుల మేరకు కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించాల్సి ఉంటుందని, మరో 96వేల మెట్రిక్ టన్నులను ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేస్తారని అంచనా వేస్తున్నారు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో వాటిని ప్రత్యేకంగా కొనుగోలు చేయనున్నారు. అవసరమైన గన్నీసంచులు, ప్యాడీ క్లీనర్లను, తేమ కొలిచే యంత్రాలను సిద్ధం చేస్తున్నారు. గతేడాది వడ్ల ధరను క్వింటాలుకు రూ.2,203 మద్దతు ధరతో కొనుగోలు చేయగా.. ఈ ఏడాది రూ.2,320 నిర్ణయించారు. పారదర్శకంగా కొనుగోళ్లు సాగించేందుకు రైతులు ఆధార్‌కార్డు ఇవ్వాలనే నిబంధన విధించారు. ఆధార్‌కార్డు లేని వారు బ్యాంకు ఖాతాబుక్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి పది రకాల గుర్తింపుకార్డుల్లో ఏదో ఒకటి ఇవ్వాలని నిర్ణయించారు. ధాన్యం కొనుగోళ్లలో దళారుల ప్రమేయాన్ని కట్టడి చేసేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు.

శ్రమఫలం చేజారుతోంది

రైతుల శ్రమఫలాన్ని వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. బాయిల్డ్ రైస్‌మిల్లులకు పచ్చి వడ్లు మరపట్టేందుకు వీలుండడంతో రైతులు కోసిన వడ్లను నేరుగా తక్కువ ధరకే కొంటున్నారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.2,203 ఉన్నా రూ.1900లకే విక్రయిస్తున్నారు. ఒక్కో క్వింటాలుపై రూ.420 దోపిడీ చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు కూడా తక్కువ ధరకైనా అమ్మేస్తున్నారు.

త్వరలోనే ప్రారంభిస్తాం



వానాకాలం వడ్ల కొనుగోళ్లకు ప్రణాళిక సిద్ధం చేశాం. ఇంకా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వరికోతలు మొదలుకాలేదు. జిల్లా వ్యాప్తంగా 258 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వం ఈసారి వడ్లకు మద్దతు ధర పెంచింది. క్వింటాలు ధర రూ.2,320 'ఏ' గ్రేడ్‌కు, కామన్ రకానికి రూ.2,300 చెల్లిస్తున్నారు. రైతులు తొందరపడకుండా వడ్లను 17 శాతం తేమ ఉండేలా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాల్లోనే వడ్లను అమ్ముకోవాలి.

– పి.వసంతలక్ష్మి, డీఎస్‌వో

రేషన్‌దందాకు చెక్!



రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్ (ఫైల్)

- బియ్యం తరలిస్తే జైలుకే..
- పకడ్బందీగా ప్రజాపంపిణీ
- 60 కేసుల్లో 86 మందిపై కేసులు
- 425 క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టివేత

ముస్తాబాద్(సిరిసిల్ల): రేషన్‌బియ్యం పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలకు దిగింది. బియ్యం అక్రమ తరలింపును అడ్డుకునేందుకు ముందడుగు వేసింది. జిల్లాలో కొందరు రైస్‌మిల్లు యజమానులు రేషన్‌బియ్యాన్ని అడ్డదారుల్లో కొని, రీసైక్లింగ్ చేయడాన్ని అధికారులు సీరియస్‌గా తీసుకుంటున్నారు. గతంలో రేషన్‌బియ్యం తరలిస్తే కేసులు మాత్రమే నమోదు చేసేవారు. కానీ నేడు పరిస్థితి మారింది. రేషన్‌బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ పట్టుబడితే జైలుకు పంపుతున్నారు. ఇటీవల ముస్తాబాద్ మండలంలోని నామాపూర్‌కు చెందిన గట్టయ్య అనే వ్యక్తి రేషన్‌బియ్యం తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు రిమాండ్‌కు తరలించారు. అంతేకాకుండా మిల్లు యజమానులు రేషన్ బియ్యం కొంటూ పట్టుబడితే ఆ మిల్లు లైసెన్స్ రద్దుకు ప్రభుత్వానికి సిఫారసు చేయనున్నారు.

జిల్లాలో యథేచ్ఛగా చీకటిదందా

రాజన్నసిరిసిల్ల జిల్లాలో చౌకధరల దుకాణాల ద్వారా ప్రజలకు పంపిణీ చేస్తున్న రేషన్‌బియ్యంలో సగానికి పైగా స్థానిక రైస్‌మిల్లులు, మహారాష్ట్రకు చేరుతున్నట్లు సమాచారం. ఇందుకు ప్రత్యేకంగా జిల్లెల్ల, సిరిసిల్ల, తంగళ్లపల్లి, నామాపూర్, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వేములవాడల్లో రేషన్‌బియ్యం కొనే దళారులు ఉన్నారు. ఇంటింటికీ తిరుగుతూ కిలో రూ.12కు సేకరించే ముఠా గ్రామాల్లో ఉండగా, మండలస్థాయిలో ఇద్దరి నుంచి నలుగురు వ్యక్తులు బడా వ్యక్తులు వారి నుంచి బియ్యాన్ని సేకరించి మిల్లులకు తరలిస్తున్నారు. ఇక మిల్లు యజమానుల్లో కొందరు ఈ బియ్యాన్నే లెవీగా చూపుతూ ప్రభుత్వానికి సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం ఇచ్చే ధాన్యాన్ని అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిసింది. ఈ దందా గత ఐదేళ్లుగా నిరాటంకంగా సాగిపోతోందనడానికి ఈ జనవరి నుంచి నమోదైన కేసులే నిదర్శనం.

జిల్లాలో పట్టుబడ్డ బియ్యం

రాజన్నసిరిసిల్ల జిల్లాలో జనవరి నుంచి ఇప్పటి వరకు 60 కేసులు నమోదయ్యాయి. ఇందులో 86 మందిపై కేసులు నమోదు చేసి, 425 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని పట్టుకున్నారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టినా రాత్రిపూట తరలిస్తున్నారు. కొన్ని చోట్ల మిల్లుల వద్ద రేషన్‌బియ్యం పట్టుబడ్డా కేసులు నమోదు కాలేదనే విమర్శలు ఉన్నాయి.

రేషన్‌బియ్యం తరలిస్తే చర్యలు



రేషన్‌బియ్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. రేషన్ దందా చేసే వారి వివరాలు పోలీస్‌శాఖ వద్ద ఉన్నాయి. వారిపై నిఘా ఉంటుంది. ఇప్పటికైనా బియ్యం స్మగ్లింగ్ నిలిపివేయాలి. ప్రభుత్వం సరఫరా చేసే బియ్యాన్ని అడ్డదారుల్లో తరలించడం నేరం. పట్టుబడ్డ వారిని జైలుకు తరలిస్తున్నాం.

– మొగిలి, సీఐ, సిరిసిల్ల రూరల్

లైసెన్స్ రద్దు చేస్తాం

రేషన్‌బియ్యం ఎవరైనన కొనుగోలు చేసిన, సరఫరా చేసిన చర్యలు తీసుకుంటాం. రైస్ మిల్లు యజమానులు రేషన్‌బియ్యం కొనుగోలు చేస్తూ పట్టుబడ్డ, నిల్వచేసుకున్న లైసెన్స్ రద్దు చేస్తాం. 6ఏ కేసులు నమోదు చేస్తాం. చౌకధరల దుకాణాల్లోనూ రెవెన్యూ నిఘా పెంచుతాం.

– వసంతలక్ష్మి, డీఎస్‌వో

శివకేశవుల బ్రహ్మోత్సవాలు షురూ..





ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌లోని శ్రీశివకేశవుల ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం ఆరంభమయ్యాయి. ఆలయ అర్చకులు హరీశ్‌శర్మ, కమిటీ చైర్మన్ ఎలుసాని దేవయ్య ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభించారు. మాజీ జెడ్పీటీసీ మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, కమిటీ సభ్యులు రామచంద్రంగౌడ్, కోడె శ్రీను, నర్సింలు, రాజేశం పాల్గొన్నారు.

జిల్లాలో నేడు నీటి సరఫరా బంద్

- మిషన్ భగీరథ ఈఈ విజయ్‌కుమార్

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా బుధవారం నీటి సరఫరా ఉండబోదని మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ విజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. సిరిసిల్ల శివారులోని నీటిశుద్ధి కేంద్రంలో పంపుహౌస్‌ల ఆపరేషన్, నిర్వహణ పనులు ఉన్నాయని వివరించారు. నీటి సరఫరాను నిలిపివేసి, ప్లాంటులో నిర్వహణపరమైన పనులు చేయాల్సి ఉందన్నారు. సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి పట్టణాలతోపాటు నియోజకవర్గాల్లోని గ్రామాల ప్రజలను బుధవారం నీటి కోసం ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని కోరారు. గురువారం యథాతథంగా నీటి సరఫరా ఉంటుందని తెలిపారు.



ఎంత పని చేశారు బిడ్డా..

- శవపేటికలపై తండ్రుల రోదన



యువకుల అంతిమయాత్రకు తరలివచ్చిన గ్రామస్తులు

వేములవాడరూరల్: 'మీ కోసం కానరాని దేశాలు పోయినం. మావలె కష్ట పడొద్దని మిమ్మల్ని కంటికి రెప్పల్లాగా చూసుకుంటుంటే ఈ వయస్సులో మీరు మాకు కానరాకుండా పోయారు.. ఎంత పని చేశారు బిడ్డా.. మాకు ఎవరు దిక్కు కొడుకా' అంటూ ఆ తండ్రులు శవపేటికలపై రోదించిన ఘటన గ్రామస్తులను కంటతడి పెట్టించింది. వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేట గ్రామంలో ఆదివారం రాత్రి బైక్ ప్రమాదంలో విక్కుర్తి దిలీప్, సూర అనిల్ మృతి చెందిన విషయం తెలిసిందే. వారిద్దరి తండ్రులు గల్ఫ్‌లో ఉండడంతో మృతదేహాలకు దహన సంస్కారాలు చేయకుండా ఇంటి వద్ద ఉంచారు. మంగళవారం ఉదయం గల్ఫ్ నుంచి వచ్చిన ఆ తండ్రులు అయ్యో కొడుకా అంటూ వారి శవపేటికలపై పడి రోదించడం కలచివేసింది. ఇద్దరు యువకులను ఒకేసారి దహన సంస్కారాలకు తరలించడంతో ఊరంతా 'అయ్యో బిడ్డలారా' అంటూ తరలివచ్చి కన్నీరు పెట్టారు.

అబ్దుల్ కలాం జీవితం స్ఫూర్తిదాయకం

- మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్



నివాళి అర్పిస్తున్న నాయకులు

సిరిసిల్ల: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జీవితం స్ఫూర్తిదాయకమని సిరిసిల్ల మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్ పేర్కొన్నారు. సిరిసిల్ల పాతబస్టాండులో మంగళవారం అబ్దుల్ కలాం జయంతి వేడుకలు నిర్వహించారు. అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి, పిల్లలకు పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. యెల్లె రాజేంద్రప్రసాద్, పోచంపల్లి రాజు, గొల్లపల్లి మల్లేశంగౌడ్, బొద్దుల బాలకృష్ణ, బైరి దేవదాస్, రాగుల వేణుగోపాల్, వెంగల శ్రీకాంత్, శ్రీనివాస్, చిట్యాల శ్రీహరి, రవీందర్ పాల్గొన్నారు.

కుదవపెట్టిన బంగారం, తూకంలో తేడా

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని మొలంగూర్ ఇండియన్ బ్యాంక్‌లో బంగారం వస్తువుతో పాటు తూకంలో తేడాలు ఉన్నాయని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. వివరాలు.. మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన కందుల విజయ ఫిబ్రవరి 28న బంగారం వస్తువులపై రూ.2,95,500 రుణం తీసుకున్నారు. మంగళవారం బ్యాంక్‌లో రుణం డబ్బులు చెల్లించి, బంగారు ఆభరణాలు వాపస్ తీసుకునే క్రమంలో గాజుల జత కనిపించలేదని అధికారులతో వాదనకు దిగారు. 114.500 గ్రాములు రశీదు ఉంటే, తూకంలో 129.500 గ్రాములు ఉండడంతో బంగారం వస్తువులు తీసుకోలేదు. తమకు సంబంధించిన వస్తువులే కావాలని, తమకు ఎక్కువ తూకం ఉన్నవి వద్దంటూ బ్యాంక్ మేనేజర్‌తో వాదనకు దిగారు. వారి ఆభరణాలు తీసుకోకుండా వెనుతిరిగారు. బ్యాంక్ జోనల్ అధికారులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

అభివృద్ధి.. సంక్షేమం

- వచ్చే నెలలో జిల్లాలో సీఎం పర్యటన
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- గౌడకులస్తులకు కాటమయ్య రక్షక కవచ కిట్ల పంపిణీ



వేములవాడలో కాటమయ్య రక్షక కవచ కిట్లను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల: రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులున్నా.. అభివృద్ధి.. సంక్షేమం కొనసాగుతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గీతకార్మికులకు కాటమయ్య రక్షక కవచ కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. 200 మంది గీత కార్మికులకు సిరిసిల్ల నియోజకవర్గంలో కాటమయ్య రక్షణ కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి వచ్చే నెలలో జిల్లాలో పర్యటించే అవకాశం ఉందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108 వాహనాలు, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక పాలసీ అమలు చేస్తున్నట్లు వివరించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డులతో సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. గీత కార్మికులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రభుత్వ భూములలో సామూహికంగా ఈతచెట్లు పెంచే అవకాశాలను పరిశీలిస్తామన్నారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, ఏఎంసీ చైర్మన్ వెల్ముల స్వరూప, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి రాజమనోహర్, అబ్కారీ శాఖ అధికారి పంచాక్షరీ, కాంగ్రెస్ నాయకులు సంగీతం శ్రీనివాస్, సూర దేవరాజు, గడ్డం నర్సయ్య, ఆకునూరి బాలరాజు, గోలి వెంకటరమణ, కామిని వనిత, బొప్ప దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి రూ.1.42లక్షలు పంపిణీ

సిరిసిల్ల పట్టణంలోని గణేశ్‌నగర్‌కు చెందిన కోడం హరికిషన్ కొడుకు బోన్ క్యాన్సర్‌తో బాధపడుతుండగా.. వైద్యఖర్చులకు ఆదుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు హరికిషన్ వినతిపత్రం అందించారు. స్పందించిన కలెక్టర్ రూ.1.42లక్షలు మంజూరు చేశారు. ఈ చెక్కును ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా అందించారు.

రైతులు పశుసంపద పెంచుకోవాలి

వేములవాడరూరల్/వేములవాడఅర్బన్: రైతులు పాలప్యాకెట్లు కొనుక్కోకుండా పాలు విక్రయించే స్థాయికి ఎదగాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కోరారు. వేములవాడరూరల్ మండలం లింగంపల్లిలో జాతీయ ఉచిత గాలికుంటూ వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. రైతులు పశుసంపద పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ రైతుపక్షపాతి అని.. ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేశామని, సాంకేతిక ఇబ్బందులు ఉండి కొందరికీ కాలేదని.. త్వరలోనే వారికి సైతం రుణమాఫీ అవుతుందని స్పష్టం చేశారు. ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు రొండి రాజు, మాజీ సర్పంచ్ సామ కవిత, కాంగ్రెస్ నాయకులు తిరుపతిరెడ్డి, అబ్బగోని అంజాగౌడ్, నేదూరి శ్రీనివాస్, అన్నాడి ఎల్లారెడ్డి, పాలకేంద్రం చైర్మన్ అంచ మల్లయ్య, గ్రామాధ్యక్షుడు చెరుకు శంకర్, పుల్కూరి రమేశ్ పాల్గొన్నారు.

కాటమయ్య కిట్ల పంపిణీ

ప్రమాదాల నివారణకు గీతకార్మికులకు కాటమయ్య రక్షక కవచం ఉపయోగపడుతుందని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ మండల ప్రజాపరిషత్ కాంపౌండ్‌లోని నూతన గ్రంథాలయ భవనంలో కాటమయ్య కిట్లను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి పంపిణీ చేసి మాట్లాడారు. కులవృత్తి చేస్తున్న సమయంలో జారిపడకుండా ఉండేందుకు కాటమయ్య రక్షణ కవచం కిట్లను అందిస్తున్నామన్నారు. గౌడ కులస్తులకు పెన్షన్, ప్రమాదాలు జరిగితే పరిహారం సైతం అందిస్తున్నామని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులున్నా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం విషయంలో వెనెకాడడం లేదన్నారు. రేషన్‌కార్డు స్థానంలో త్వరలోనే ఫ్యామిలీ కార్డు అందిస్తామని, ఆ కార్డు ద్వారానే ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. వేములవాడ ఆలయ అభివృద్ధికి నిధులు తెచ్చుకున్నామన్నారు. ముంపు గ్రామాల ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

గీతకార్మికులకు రక్షక కిట్లు

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో 200 మంది గీతకార్మికులకు కాటమయ్య రక్షణ కవచ కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ రక్షక కిట్ ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ప్రతీ గీతకార్మికుడికి రక్షక కిట్ అందిస్తామని తెలిపారు. బీసీ సంక్షేమశాఖ అధికారి రాజమనోహర్, అబ్కారీశాఖ అధికారి పంచాక్షరీ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'విప్'కు కాటన్ వస్త్రోత్పత్తిదారుల వినతి

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను సిరిసిల్ల కాటన్ వస్త్రోత్పత్తి, అనుబంధ రంగాల జేఏసీ ప్రతినిధులు కలిశారు. ఒకప్పుడు కాటన్ వస్త్రోత్పత్తితో ఉపాధి పొందిన వేలాది కుటుంబాలకు మళ్లీ ప్రభుత్వం ద్వారా ఆర్డర్లు ఇప్పించి పునర్వైభవం కల్పించాలని కోరారు. జేఏసీ ప్రతినిధులు గౌడ సురేశ్, పిస్క మధు, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, గడ్డం నర్సయ్య పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

- కరీంనగర్, KCR బిల్డింగ్ నుండి వల్లంపహాడ్ గ్రామ పరిధి కెనాల్‌ను ఆనుకొని ఈస్ట్ ఫేస్, సర్వే నెం. 165/7/1 60 గుంటలు గల ప్లాట్ డెవలప్‌మెంట్‌కు గాని/ అమ్మకానికి కలదు. డైరెక్ట్ సంప్ర: సెల్: 9618088678. [K- 1246772]

WANTED

- నూతనంగా ప్రారంభించబడిన VSR ఎంటర్‌ప్రైజెస్ నందు పనిచేయుటకు సూపర్‌వైజర్స్, ఎగ్జిక్యూటివ్ ఫీల్డ్ ఆఫీసర్స్, లేడీ టెలికాలర్స్, ITI All Trades వెంటనే కావలెను. రూం+భోజనం ఫ్రీ. జీతం: 15,000 నుండి 25,000. ఫోన్ : 88866 60569. [V-823870]
- ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1185480]
- ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను పిల్లలను చూసుకొనుటకు ఇంటి/వంట పనికి వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 20K. Ph: 8977639662, 8977639663 [H-796283]
- ప్రముఖ ప్రసిద్ధిగాంచిన కంపెనీలో టీం లీడర్స్‌గా సిద్దిపేట, జగిత్యాల & సంగారెడ్డి మరియు చుట్టు ప్రక్కల ప్రాంతాలలో పనిచేయుటకు M/F కావలెను. Q: 10th ఆపై Age: 25 ఆపై Contact: 9393055164. [HA-1177746]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

కేసీఆర్‌నగర్‌లో నార్కోటిక్స్ తనిఖీలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మత్తుపదార్థాల నిర్మూలనకు పోలీసు అధికారులు మంగళవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లి డబుల్ బెడ్‌రూమ్ సముదాయం(కేసీఆర్ నగర్)లో నార్కోటిక్స్, క్లూస్ టీమ్ ఆధ్వర్యంలో పోలీస్ జాగిలంతో కిరాణషాపులను తనిఖీ చేశారు. తంగళ్లపల్లి ఏఎస్సై చంద్రమౌళి, క్లూస్ టీమ్ కానిస్టేబుల్ ప్రశాంత్‌గౌడ్, నార్కోటిక్ కానిస్టేబుల్ సురేశ్, పోలీస్ జాగిలం రాకీ పాల్గొన్నారు.



కేసీఆర్‌నగర్‌లో జాగిలంతో తనిఖీలు చేస్తున్న నార్కోటిక్స్ పోలీసులు